క్లుప్తంగా

అధ్యయన కేంద్రాల ఏర్పాటుకు డిమాండ్


రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందిస్తున్న నేతలు

తిరుపతి సిటీ : ఎస్వీయూలో జ్యోతిరావు పూలే, అంబేడ్కర్, జగ్జీవన్ రామ్ అధ్యయన కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఏపీ స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హేమాద్రి యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ భూపతినాయుడుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నేతలు మురళీ కృష్ణ, సుధాకర్, తిరుమలేష్, లోకేష్, ప్రసాద్, యుగంధర్, ప్రదీప్, పవన్‌కుమార్, మహేంద్ర నాయక్ పాల్గొన్నారు

బార్ కౌన్సిల్ అధ్యక్షుడిగా గురుస్వామినాయుడు


అధ్యక్షుడితో ఉపాధ్యక్షుడు, సెక్రటరీ

పాకాల : స్థానిక కోర్టులో శుక్రవారం నిర్వహించిన బార్ కౌన్సిల్ ఎన్నికల్లో న్యాయవాది గురుస్వామినాయుడు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా చిన్నరెడ్డెప్ప, సెక్రటరీగా చంద్రమోహన్ ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు గురుస్వామినాయుడు వెల్లడించారు. ఎన్నికైన వారిని సభ్యులు గౌరీశంకర్‌రాజు, సుబ్రమణ్యం రెడ్డి, ప్రవీణ్‌ప్రకాష్ అభినందనలు తెలిపారు.

వైభవంగా కుంభాభిషేకం

పాకాల : మండలంలోని పెద్దగోర్పాడు శ్రీకోదండ రామాలయంలో శుక్రవారం వైభవంగా కుంభాభిషేకం నిర్వహించారు. అష్టావధాని మేడసాని మోహన్ ఈ సందర్భంగా స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఎస్.దామోదరం, వైస్ చైర్మన్ వేణు నాయుడు, జనరల్ సెక్రటరీ కృష్ణమూర్తి, జాయింట్ సెక్రటరీ భాస్కర్‌నాయుడు, ట్రెజరర్ ఆదికేశవులనాయుడు, మోహన్‌నాయుడు, విశ్వనాథనాయుడు పాల్గొన్నారు. .

'టాలెంట్ హంట్'లో విద్యార్థి ప్రతిభ


మెడల్, సర్టిఫికెట్‌తో వాణి ప్రీతం

తిరుపతి ఎడ్యుకేషన్ : న్యూఢిల్లీకి చెందిన సిల్వర్ జోన్ సంస్థ ఇటీవల జాతీయ స్థాయి టాలెంట్ హంట్ పరీక్ష నిర్వహించింది. ఇందులోఓ తిరుపతి కేంబ్రిడ్జి పాఠశాల 8వ తరగతి విద్యార్థి వాణి ప్రీతం పాకనాటి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం దక్కించుకున్నారు. శుక్రవారం ఈ మేరకు పాఠశాల కరస్పాండెంట్ కల్పన మాట్లాడుతూ వాణి ప్రీతం గతంలోనూ పలు పోటీల్లో పతకాలు సాధించినట్లు వెల్లడించారు.

ఉపాధ్యాయులకు అభినందన


విద్యార్థితో టీచర్లు

పాకాల : మండలంలోని ఓబులశెట్టివారిపల్లె ఉన్నత పాఠశాలలో చదువు మానేసిన 8వ తరగతి విద్యార్థులు హేమాద్రి, గజేంద్ర, జ్యోత్స్న ఇళ్లకు వెళ్లి మాట్లాడి మళ్లీ బడిలో చేర్పించిన ఉపాధ్యాయులను ఎంఈఓ బాబ్జీ అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

చంద్రగిరిలో 'ఇండ్-గ్యాప్ పొలంబడి'

చంద్రగిరి : మండలంలోని మిట్టపాళెం, తొండవాడలో శుక్రవారం భూలక్ష్మి నేచురల్ ఎఫ్‌పీఓ వారు ఇండ్-గ్యాప్ పొలంబడి నిర్వహించారు. గుంటూరుకు చెందిన ఏపీ ఎక్స్‌టర్నల్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ ఎస్.రవి, జిల్లా వాల్యూయేటర్ కె.మునిశేఖర్, ఏఓ విజయ భాస్కర్ పొలాలను సందర్శించి, పంటను పరిశీలించారు. ఏడీఏ మనోహర్ బాబు, రేణిగుంట ఏఓ సునీల్, ఎర్రావారిపాళెం ఏఓ ఖాదర్‌బాషా, టీఏ సుధ, వీఏఏలు సుధ, హర్షిత, ధనశేఖర్, సాజిద్ పాల్గొన్నారు.

విద్యతో ఉజ్వల భవిత


బహుమతులు ప్రదానం చేస్తున్న శ్రీదేవి తదితరులు

తిరుపతి కల్చరల్ : విలువలతో కూడిన విద్యతో ఉజ్వల భవిత సాధ్యమని ఆ దిశగా విద్యార్థులను తీర్చిదిద్దాలని సాహితీ వేత్త, విశ్రాంత అధ్యాపకులు గంగవరం శ్రీదేవి కోరారు. శుక్రవారం మహతి కళాక్షేత్రంలో గౌతమ్ టాలెంట్ స్కూల్ 27వ వార్షికోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో గురుశిష్యుల అనుబంధానికి విశిష్టత ఉందన్నారు. క్రమశిక్షణతో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న గౌతమ్ టాలెంట్ స్కూల్ నిర్వాహకులు అభినందనీయులని కొనియాడారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. స్కూల్ డైరెక్టర్ డాక్టర్ వై.శ్రీనివాసులు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

పాకాల: స్థానిక వెలుగు కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. శుక్రవారం తిరుపతి డివిజన్ ప్రజా భాగ్యస్వామ్య ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారులు మాట్లాడుతూ పెరటి తోటలు పెంపకంపై మహిళలు దృష్టి సారించాలని సూచించారు. ఏఓ పుష్పావతి, ఏపీఓ ఆషారాణి, ఉద్యానశాఖ అధికారి శైలజ, ఏపీఎం రామ్మోహన్ పాల్గొన్నారు.

టీడీఆర్ బాండ్లు.. తీరని బాధలు!


బాధితుల నుంచి వినతులు స్వీకరిస్తున్న అధికారులు

ఆధ్యాత్మిక నగరిని అందంగా తీర్చిదిద్దడంలో తమ వంతు పాత్ర పోషించారు. తిరుపతిలో అత్యాధునిక రోడ్ల నిర్మాణానికి భూములు అందించారు. నగరవాసుల ట్రాఫిక్ ఇక్కట్లను తప్పించేందుకు త్యాగనిరతిని ప్రదర్శించారు. కానీ, మంచికి పోతే చెడు ఎదురైందన్నట్లు తయారైంది.. మాస్టర్‌ప్లాన్ రోడ్ల భూ నిర్వాసితుల పరిస్థితి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి పిలుపు మేరకు పలువురు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రహదారుల నిర్మాణానికి తమ స్థలాలు అప్పగించారు. అయితే నగర అభివృద్ధిపై వారి చిత్తశుద్ధిని గుర్తించేందుకు కూటమి సర్కారుకు మనసు రావడంలేదు. నిబంధనల ప్రకారం నిర్వాసితులకు టీడీఆర్ బాండ్లు మంజూరు చేయకుండా వేధిస్తోంది. పైగా స్పెషల్ డ్రైవ్ పేరుతో హంగామా చేసి చేతులు దులిపేసుకుంటోంది.

- గందరగోళంగా స్పెషల్ డ్రైవ్
- స్పష్టత లేదు.. పరిష్కారం చూపలేదు
- కొర్లగుంటకు ఒకలా.. ఖాదీకాలనీకి మరోలా!
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నెపం నెట్టేస్తూ కుంటి సాకులు

తిరుపతి తుడా : టీడీఆర్ బ్లాండ వ్యవహారంపై ఇప్పటికీ స్పష్టత కరువైంది.శుక్రవారం నగరపాలక సంస్థలో ఏర్పాటు చేసిన టీడీఆర్ బాండ్ల స్పెషల్ డ్రైవ్‌లో బాధితుల నుంచి అర్జీలు స్వీకరించి మమ అనిపించారు. సమస్య పరిష్కారమవుతుందని ఆశగా ఎదురుచూసిన బాధితులకు అధికారుల నిర్ణయాలు శాపంగా మారాయి. గతంలోని నిబంధనలను పక్కన పెట్టి సరికొత్త రూల్స్ తీసుకురావడంతో ఎక్కువ మంది నష్టపోయే ప్రమాదం కనిపిస్తోంది. పైగా గత పాలకులపై నిందలు వేయడమే లక్ష్యంగా డ్రైవ్ సాగడం విమర్శలకు తావిస్తోంది. మాస్టర్ ప్లాన్ రోడ్లకు స్థలాలు ఇచ్చిన యజయానులకు మేలు చేయకపోగా కుంటి సాకులు చెబుతూ నష్టం చేకూర్చేదిశగా అధికారుల నిర్ణయాలు కొనసాగుతున్నాయి

సమాధానం లేదు

తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో జరిగిన టీడీఆర్ బాండ్ల స్పెషల్ డ్రైవ్ సమావేశం గందరగోళంగా మారింది.. భాదితులకు సరైన సమాధానం, భరోసా, ఇచ్చేవారు కరువయ్యారు. టీడీఆర్ బాండ్ల మంజూరుపై తమకే స్పష్టత లేదని కొందరు అధికారులు బహిరంగంగా వ్యాఖ్యానించడం గమనార్హం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కొర్లగుంటరోడ్డు , గ్రూప్ థియేటర్ రోడ్డు, అన్నారావు సర్కిల్ నుంచి పార్క్‌కు వెళ్లే ఖాదీకాలనీ మెయిన్ రోడ్‌లను మాస్టర్ ప్లాన్‌లో భాగంగా విస్తరించారు. నగరాభివృద్ధికి రోడ్డుకు ఇరువైపులా స్థలాలు, ఇళ్లను తొలగించేందుకు ప్రజలు సహకరించారు. బాధిత యజమానులకు గత ప్రభుత్వ హయాంలో నోటీసులు జారీ చేయడంతో మున్సిపల్ కార్పొరేషన్‌కు గిఫ్ట్ డీడ్‌గా రాసిచ్చారు. నోటీసులు, గిఫ్ట్ డీడ్, యజమాని పత్రాల ఆధారంగా టీడీఆర్ బాండ్లను ఇవ్వాల్సి బాధ్యత అధికారులపై ఉంది. అయితే ఇటీవల అధికారులు కక్ష్య సాధింపు దోరణితో వ్యవహరిస్తూ కొత్త నిబంధనలకు తెరపైకి తెచ్చారు. కొద్దిరోజుల క్రితం వరకు సర్వే నంబర్ల ఆధారంగా విభజించి టీడీఆర్‌లు ఇస్తామంటూ గందరగోళానికి తెరలేపారు. దీనిపై విమర్శలు రావడంతో ప్రస్తుతం లొకాలిటీ ఆధారంగా ఇళ్లులేని ప్రాంతాలు, దుకాణాల పన్నుల ఆధారంగా టీడీఆర్‌లు ఇస్తామంటూ సరికొత్త రూల్స్ తీసుకురావడంతో స్థలాలు ఇచ్చిన యజమానులు తలలు పట్టుకుంటున్నారు. టౌన్‌ప్లానింగ్‌లోని ఓ కీలక అధికారికి తెలుగులో సమాధానం చెప్పలేకపోవడం బాధితులకు ఇంగ్లిష్ రాకపోవడంతో అందరూ తికమకపడ్డారు.టౌన్‌ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత డ్రైవ్‌లో పాల్గొని తమకు న్యాయం చేస్తారని ఎదురు చూసిన బాధితులకు నిరాశ ఎదురైంది. ఆమె సకాలంలో రాకపోవడంతో యజమానులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సమస్య పరిష్కరిస్తారని వస్తే మరో మారు అర్జీలు తీసుకుని తరిమేయడంపై మండిపడ్డారు.

626 మందికి ఇవ్వాలి

నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన టీడీఆర్ మేళాలో 35 మంది భూ నిర్వాసితులకు ఆధార్ వాలిడేషన్ చేశాం. 45 మందికి ప్రీ అప్రూవల్ చేసి గిఫ్ట్ డీడ్ ఇచ్చేందుకు అనుమతి మంజూరు చేశాం . మొత్తం 27 మాస్టర్ ప్లాన్ రోడ్లకు గాను 1,074స్థలాలు ఈ మార్గాల్లో ఉన్నాయి. ఇప్పటి వరకు 443 మందికి టీడీఆర్ బాండ్లు ఇచ్చాం. ఇంకా 626 మందికి ఇవ్వాల్సి ఉంది. 214 మంది దరఖాస్తులను ఆన్‌లైన్ చేశాం. బాండ్ల జారీకి తప్పక సహాయం చేస్తాం.

- మౌర్య, కార్పొరేషన్ కమిషనర్

బాధితుల ఆవేదన

కొర్లగుంట, గ్రూప్ థియేటర్ రోడ్డు విస్తరణలో ఇళ్ల ముందు స్థలం కోల్పోయిన వారికి టీడీఆర్ బాండ్లు మంజూరు చేశారు. ఇదే సమయంలో ఖాదీ కాలనీ రోడ్డులో స్థలం కోల్పోయిన వారికి మాత్రం టీడీఆర్ బాండ్ల మంజూరు చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. అ ప్రాంత ప్రజలు అనేక సార్లు అధికారులకు తమ గోడు వెళ్లబోసుకున్నప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది. టీడీఆర్ బాండ్ల స్పెషల్ డ్రైవ్‌లో న్యాయం జరగుతుందని వచ్చిన బాధితులకు మళ్లీ నిరాశే ఎదురైంది. దీంతో బాధితులు తీవ్రస్థాయిలో కూటమి ప్రభుత్వ వైఖరిపై విరుచుకుపడ్డారు. తమకు అన్యాయం చేస్తున్నారని, తమ గోడు తప్పక తగులుతుందని విలపిస్తూ శాపనార్థాలు పెట్టారు. స్పెషల్ డ్రైవ్‌లో టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత, అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసులు, కమిషనర్ మౌర్య, డీసీపీ మహాపాత్ర, ఏసీపీలు బాలాజీ, మూర్తి పాల్గొన్నారు

నోటీస్ బోర్డు

- భజన భక్త మండలి ఆధ్వర్యంలో ఉదయం 4.45 గంటలకు శ్రీగోవిందరాజస్వామి ఆలయ మాడ వీధులలో నగర సంకీర్తన.
- చంద్రగిరిలోని శ్రీకోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకుశనివారం సాయంత్రం అంకురార్పణ.
- రాజన్న పార్క్ సమీపంలోని గగన కోచింగ్ సెంటర్‌లో ఉదయం 9 గంటలకు పాలి సెట్ నమూనా పరీక్ష.
- ఎస్వీయూ సెనెట్ హాల్‌లో ఉదయం 10 గంటలకు అకడమిక్ రైటింగ్స్‌పై జాతీయ వర్క్ షాప్.
- బైరాగిపట్టెడ ఆర్చికి ఎదురుగా జగ్జీవన్‌రామ్ భవన్‌లో ఉదయం 10 గంటలకు బాబు జగ్జీవన్‌రామ్ జయంతి.
- మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శాంతినగర్, శ్రీకృష్ణనగర్, ఎస్వీ నగర్, అమరావతినగర్, వెస్ట్ చర్చి సర్కిల్, న్యూబాలాజీ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం.
- జేఈఈ మెయిన్స్ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు , తిరిగి మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు నిర్వహణ.
- ఎస్‌పీడీసీఎల్ కార్యాలయం వద్ద కాంట్రాక్ట్ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష 13వ రోజు కొనసాగింపు.
- టీటీడీ ఆధ్వర్యంలో ఉదయం 10.30 గంటలకు మహతి ఆడిటోరియంలో జగ్జీవన్‌రామ్ జయంతి.
- కచ్చపి ఆడిటోరియంలో ఉదయం 11.30 గంటలకు స్ప్రింగ్‌డయల్ స్కూల్ వార్షికోత్సవం.
- ఇస్కాన్ రోడ్డులోని శ్రీరామకృష్ణ మిషన్ ఆశ్రమంలో సాయంత్రం 6.30 నుంచి ఆకెళ్ల విభీషణ శర్మ ప్రవచనామృతం.

రైతులకు రాయితీపై పరికరాలు

తిరుపతి రూరల్ : మండలంలోని దుర్గసముద్రంలో రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాలను శుక్రవారం పంపిణీ చేశారు. ప్రభుత్వం 50శాతం సబ్సిడీతో మంజూరు చేసిన పనిముట్లను ఎమ్మెల్యే పులివర్తి నాని చేతులమీదుగా లబ్ధిదారులకు అందించారు. ఈ క్రమంలోనే యూనియన్ బ్యాంకు సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం అడపారెడ్డిపల్లె పశువుల దాహార్తిని తీర్చే నీటితొట్టి నిర్మాణానికి భూమి పూజ చేశారు.

పరిపూర్ణం





శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఉదయం కపిలతీర్థంలోని పుష్కరిణిలో నిర్వహించిన చక్రస్నానంతో పరిపూర్ణమయ్యాయి. ఈ సందర్భంగా సీతారామలక్ష్మణ, చకత్తాళ్వార్‌కు వేడుకగా స్నపన తిరుమంజనం జరిపించారు. అనంతరం కోదండరామాలయంలో చేపట్టిన ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ రవి, సూపరింటెండెంట్ మునిశంకర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.

- తిరుపతి కల్చరల్

పారిశుద్ధ్య పనుల పరిశీలన

తిరుపతి తుడా : బాలాజీ కాలనీ శ్మశానవాటిక, ఎల్‌ఐసీ రోడ్డు, సంస్కృత విద్యాపీఠం, రిజర్వాయర్ కాలనీ తదితర ప్రాంతాల్లో శుక్రవారం చేపట్టిన పారిశుద్ధ్య పనులను కార్పొరేషన్ కమిషనర్ మౌర్య పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని శ్మశాన వాటికలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పారిశుద్ధ్య పనులను మెరుగ్గా చేపట్టాలని ఆదేశించారు. రిజర్వాయర్ కాలనీలో వాటర్ ట్యాంక్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని స్పష్టం చేశారు. కుక్కల బెడదపై ఫిర్యాదులు వస్తున్నాయని, వెంటనే పరిష్కరించాలని వెటర్నరీ అధికారికి సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రామస్వామి వెంకటేష్, నరసింహాచ్చారి, ఎస్ఈ శ్యామ్‌సుందర్, ఎంఈ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు.

ఎండలతో జాగ్రత్త


మాట్లాడుతున్న డీఆర్‌ఓ నరసింహులు

తిరుపతి అర్బన్: ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా మండలాల వారీగా చర్యలు చేపట్టాలని డీఆర్వో నరసింహులు ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆయన శుక్రవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని చెప్పారు. తాగు నీటి సమస్య లేకుండా చూడాలని చెప్పారు. డీపీవో సుశీలాదేవి, జెడ్పీ డెప్యూటీ సీఈఓ జుబేదా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి బాలకృష్ణనాయక్, అగ్నిమాపక అధికారి రమణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి విజయకుమార్, పశుసంవర్ధకశాఖ అధికారి రవికుమార్, ఐసీడీఎస్ పీడీ వసంత బాయి పాల్గొన్నారు.

ఎస్వీయూలో స్కాలర్స్ ఆందోళన


వీసీ చాంబర్ వద్ద బైఠాయించిన విద్యార్థులు, నేతలు

తిరుపతి సిటీ : ఎస్వీయూ యూజీసీ ఫెలోషిప్‌లను పునరుద్ధరించకుండా వేధిస్తున్న అధికారుల తీరు కు నిరసనగా స్కాలర్స్, విద్యార్థి సంఘాల నేతలు ఆందోళనకు చేపట్టారు. శుక్రవారం ఈమేరకు వీసీ చాంబర్ ఎదుట బైఠాయించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర వర్సిటీల కో-కన్వీనర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ ఫెలోషిప్ సెక్షన్‌లోసమర్థవంతగా విధులు నిర్వహిస్తున్న రూపేష్ అనే ఉద్యోగిని బదిలీ చేయడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందన్నారు. ఫెలోషిప్ రాకపోవడంతో 76 మంది పరిశోధక విద్యార్థులు మెస్ బిల్లులు చెల్లించలేక, డేటా సేకరణకు వెళ్లేందుకు డబ్బులు నానా అవస్థలు పడుతున్నారని మండిపడ్డారు. కొత్తగా చేరిన 26 మందికి ఫెలోషిప్ నమోదు చేయలేదని ఆరోపించారు. అనంతరం వీసీకి వినతిపత్రం అందించారు. నేత లు మల్లికార్జున, శివ శంకర్ నాయక్, సుందర్, వి ద్యార్థులు శ్రీనివాసులు, సంతోష్, చక్రి, హనీఫ్, నరేష్, శివ, దొరబాబు, శ్రీనివాస్, సాయిపాల్గొన్నారు.

శ్రీరామలో ఘనంగా 'ఆవిష్కర్'


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథి, నిర్వాహకులు

తిరుపతి సిటీ : కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కాలేజ్‌లో శుక్రవారం జాతీయ స్థాయి సాంకేతిక సదస్సు ×ఆవిష్కర్-2025ను ఘనంగా నిర్వహించారు. ఎన్ఎఆర్ఎల్ సైంటిస్ట్ మునిరాజా ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అయన మాట్లాడుతూ శాస్త్ర సాంకేతికరంగంలో వచ్చిన మార్పులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి, సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, డైరెక్టర్ మన్నెం అరవింద్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ జయచంద్ర పాల్గొన్నారు .

ఆదర్శనీయంగా 'రాస్' సేవలు


మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీలత

తిరుపతి కల్చరల్ : నిస్వార్థంగా, ఆదర్శనీయంగా రాస్ సంస్థ సేవలందిస్తోందని డీఎస్పీ శ్రీలత కొనియాడారు. శుక్రవారం రాస్ సేవా నిలయంలో ముందస్తు శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఎస్పీ పాల్గొని ప్రసంగించారు. మహిళలు అన్ని రంగాలలో ముందు ఉండాలని, వేసవి సెలవులు రావడంతో పిల్లలతో ఎక్కువ సమయం గడపాలని సూచించారు. రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం మాట్లాడుతూ శ్రీరాముని జీవితం అందరికి ఆదర్శమని తెలిపారు. అనంతరం దివ్యాంగులకు వీల్ చైర్స్ అందించారు. రాస్ సంయుక్త కార్యదర్శి మమత, అధికారులు బాలాజీరెడ్డి, రవి, వెంకటేష్, వాని, నాగేశ్వర్, భార్గవి, వనజ పాల్గొన్నారు.

ఎస్వీజేసీలో సమతా దివస్

తిరుపతి ఎడ్యుకేషన్ : ఎస్వీ జూనియర్ కళాశాలలో శుక్రవారం సమతా దివస్‌ను పురస్కరించుకుని బాబు జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ప్రిన్సిపల్ సి.ప్రకాష్‌బాబు ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

నీటి కష్టాలు తీర్చాలని వినతి


నీటి సమస్యని వివరిస్తున్న సర్పంచ్‌లు

తిరుపతి రూరల్ : మండలంలోని అవిలాల, లింగేశ్వరనగర్, వేదాంతపురం, గాంధీపురం పంచాయతీల్లో తాగునీటి సమస్యలను పరిష్కరించాలని ఆయా పంచాయతీల సర్పంచ్‌లు కోరారు. శుక్రవారం ఈ మేరకు ఎంపీడీఓ రామచంద్రతో మాట్లాడారు. అదనపు బోర్లు మంజూరు చేయాలని, లేకుంటే తిరుపతి కార్పొరేషన్ వేసిన బోర్లను వినియోగించుకునేందుకు అనుమతి తీసుకోవాలని సూచించారు. ఈ క్రమంలోనే పద్మావతీపురం, శ్రీనివాసపురం పంచాయతీల్లో నీటి ఎద్దడి తలెత్తే అవకాశముందని, ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు గణపతినాయుడు, సునీల్ కోరారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి ఆత్మహత్య

తిరుపతి క్రైమ్ : నగరంలోని వేర్వేరు చోట్ల ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వివరాలు.. యాదవ్ కాలనీకి చెందిన లక్ష్మీప్రసన్న (55) భర్తతో గొడవపడి ఇంట్లో ఒకటే ఉండేది. రెండు రోజుల నుంచి ఆమె ఇంటి నుంచి బయటకు రాకపోవడంతో శుక్రవారం చుట్టపక్కలవారు పోలీసులకు సమాచారం అందించారు. తలుపులు పగలగొట్టి చూడగా ఆమె మృతి చెందింది. అలాగే సంజయ్ గాంధీ కాలనీకి నారాయణమ్మ (46) భర్తతో మనస్పర్థల కారణంగా దూరంగా ఉంటోంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. ఈమృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయవాద గుమస్తాలకు కొత్త కార్యవర్గం


ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

తిరుపతి లీగల్ : తిరుపతి న్యాయవాద గుమస్తాల సంఘం కార్యవర్గ ఎన్నికలను శుక్రవారం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా వి.కుప్పయ్య, ఉపాధ్యక్షుడిగా బి.దాము, కార్యదర్శిగా వై.బాలాజీ కుమార్, సంయుక్త కార్యదర్శిగా బి.జనార్దన్‌రెడ్డి, కోశాధికారిగా హేమచంద్ర ఎన్నికయ్యారు.